ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## ఈసీ సంచలన నిర్ణయం
### బెంగాల్ డీజీపీ సహా 6 రాష్ట్రాల హోం కార్యదర్శులపై వేటు
2లో..

సంపుటి: 1 | సంచిక: 343 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 19 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# గవర్నర్ తమిళిసై రాజీనామా
### రాష్ట్రపతికి రాజీనామా లేఖను పంపిన తమిళిసై
### చెన్నై సెంట్రల్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎంపీగా పోటీ?

హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం): తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి సైతం ఆమె రాజీనామా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమిళనాడుకు చెందిన తమిళిసై.. ఈసారి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. చెన్నై సెంట్రల్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసేందుకు గానూ.. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పోస్టుకు ఆమె రాజీనామా చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. తమిళిసై పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తారనే ప్రచారం ఎప్పట్నుంచో సాగుతోంది. తన సొంత రాష్ట్రం తమిళనాడు నుంచి బరిలో దిగేందుకు ఆమె ఆసక్తి చూపుతున్నారనే వార్తలు వచ్చాయి. చెన్నై సెంట్రల్‌లో లేదా తూత్తుకుడి నుంచి ఆమె పోటీ చేయనున్నట్లు ప్రచారం జరిగింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె తూత్తుకూడి నుంచి పోటీచేసి డీఎంకే అభ్యర్థి కనిమొళి చేతిలో ఓటమి చవిచూశారు. 2006 నుంచి తమిళిసై ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నా.. ఇంత వరకూ ఒక్కసారి కూడా విజయాన్ని అందుకోలేకపోయారు. వృత్తిరీత్యా గైనకాలజిస్ట్ అయిన తమిళిసై బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 1999లో ఆ పార్టీలో చేరారు. తమిళనాడులో బీజేపీ బలోపేతం కావటంలో ఆమె పాత్ర కీలకమైంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా, జాతీయ కార్యదర్శిగా పలు పదవులను నిర్వహించారు. 2006 ఎన్నికల్లో రామనాథపురం నియోజవర్గం నుంచి తొలిసారి ఆమె అసెంబ్లీకి పోటీ చేయగా ఓటమి ఎదురైంది. 2009 లోక్‌సభ ఎన్నికల్లో నార్త్ చెన్నై నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి మరోసారి ఓడిపోయారు. 2011 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో వేళచ్చేరి నుంచి పోటీచేసి నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి నేతృత్వంలో తూత్తుకుడి నుంచి పోటీ చేయగా.. మరోసారి కూడా ఓటమి ఎదురయ్యింది. అనంతరం 2019లోనే తెలంగాణ గవర్నర్‌గా నియమితులయ్యారు. పుదుచ్చేరి ఇన్‌ఛార్జి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ కేంద్రం అదనపు బాధ్యతలను అప్పగించింది. తెలంగాణ గవర్నర్‌గా నియామకం అయిన తొలినాళ్లలో కేసీఆర్ ప్రభుత్వంతో సఖ్యతతోనే ఉన్న తమిళిసై ఆ తర్వాత తన నిర్ణయాలతో ప్రభుత్వానికి దూరమైంది. కేసీఆర్ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించటం లేదని బహిరంగంగానే విమర్శించింది. ప్రభుత్వం పంపిన వివిధ బిల్లులను తిప్పి పంపటంతో పాటు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి అభ్యంతరం చెప్పారు. అలా గవర్నర్‌కు ప్రభుత్వానికి మధ్య గ్యాప్ ఏర్పడింది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం

..మిగతా 2లో





### తెలంగాణ వికాసం కోసం
# బీజేపీకి ఓటేయండి
**తాను మహిళా శక్తిని నమ్ముకున్నాను**
**రోజురోజుకు పెరుగుతున్న బిజెపి బలం**
**మూడోసారి గెలుపు బిజెపిదే**
**కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే**
**లిక్కర్ కేసుతో ఢిల్లీకి చేరిన అవినీతి డబ్బు**
**కవిత కేసుపై జగిత్యాల సభలో ప్రధాని మోడీ ప్రస్తావన**

జగిత్యాల, మార్చి 18 (ప్రభాత ఉదయం): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించి తెలంగాణ వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాలలో జరిగిన విజయసంకల్ప సభలో మోదీ మాట్లాడారు. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకి ఆదరణ పెరుగుతోందన్నారు. మే13న తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టిస్తారని.. వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలన్నారు. జూన్4న వచ్చే ఫలితాల్లో ఎన్డీయే 400 సీట్లు గెలవాలని ఆకాంక్షించారు. తనకు మద్దతుగా నిలవాలంటే తెలంగాణలో కూడా సీట్లు గెలవాల్సి ఉందని అన్నారు. ప్రజలంతా తనకు మద్దతు కోసం బిజెపిని గెలిపించాలన్నారు. కరీంనగర్ నుంచి బండి సంజయ్‌ను, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్‌ను, పెద్దపల్లి నుంచి

..మిగతా 2లో

### బీఆర్ఎస్‌లో చేరిన
# ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం): బీఎస్పీకి రాజీనామా చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సిద్ధిపేట జిల్లాగజ్వేల్‌లోని ఎర్రవల్లిలో ఉన్న ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు సమక్షంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి కేసీఅర్ పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు.. తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. గజ్వేల్‌లోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో తెలంగాణ విశాల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌లో చేరుతున్నానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ గేట్లు తెరిస్తే వెళ్లిన గొర్రెల్లాగా వచ్చిన వ్యక్తిని కాదని ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. గజ్వేల్‌లోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'నిజాయితీకి కట్టుబడి ఉన్నా. ఓ వైపు మంచివాడు అంటూ నన్ను రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారు. స్వార్ధం కోసం ఎన్ని కోట్లు తీసుకొని వెళ్తున్నావు అంటూ సోషల్ మీడియాలో అడుగుతున్నారు.డబ్బు కోసం ఆశపడిన వాడిని అయితే కాంగ్రెస్‌లో చేరుతా. బీఆర్ఎస్ కాదు. టీఎస్‌పీఎస్సీ చైర్మర్ ఆఫర్ ఇస్తే.. తిరస్కరించా. నా గుండెల్లో ఎప్పుడూ బహుజన వాదం ఉంటుంది. నేనెప్పుడూ బహుజనులు సంక్షేమం కోసమే పోరాడుతా. రేవంత్ రెడ్డే కాదు నేను కూడా పాలమూరు బిడ్డనే' అని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇక.. ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్‌కు బయలుదేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇతర టీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అనుచరులు అభిమానులు ఉన్నారు.

### ఎన్నికల బాండ్లపై మరోసారి
# సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
**ఎస్బీఐ డేటా అసంపూర్తిగా ఉందని తీవ్ర అసహనం**
**మార్చి 21 సాయంత్రం వరకూ సమయమిచ్చిన ధర్మాసనం**



2



# దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయండి
### స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విజ్ఞప్తి
2

# ఆ ముగ్గురితో కవితకు లింకులు..
### ఇప్పటికే 128 కోట్ల ఆస్తులు సీజ్.. ఈడీ సంచలన ప్రకటన




న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దూకుడు పెంచింది. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్న ఈడీ రెండు రోజులుగా విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే.. కవిత అరెస్టుపై.. ఈడీ అధికారిక ప్రకటన చేసింది. ఈ ప్రకటనలో సంచలన విషయాలను ఈడీ వెల్లడించింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసి.. కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని.. విచారిస్తున్నామని ఈడీ స్పష్టం

..మిగతా 2లో

# తెలంగాణ వికాసం కోసం బీజేపీకి ఓటేయండి

మొదటి పేజీ తరువాయి...

గోమాస శ్రీనివాస్‌లను గెలిపించాలని ప్రధాని పిలుపునిచ్చారు. వారిని ప్రజలకు పరిచయం చేశారు. విపక్షాల ఇండియా కూటమిలో ఐక్యత లేదన్నారు. కూటమిలో పార్టీలన్ని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ముంబయిలో జరిగిన రాహుల్ గాంధీ న్యాయ జోడో యాత్రను ప్రస్తావిస్తూ.. విపక్షాల అనైక్యత ఆసభలో కనిపించిందని అన్నారు. రాహుల్‌గాంధీ శక్తిపై తమ పోరాటం అన్నారని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తేలిపోతుందన్నారు. శక్తిని నాశనం చేయాలని విపక్ష కూటమి భావిస్తోందన్నారు. తెలంగాణ కలలను కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. కవిత అరెస్ట్‌పై మోదీ మొదటిసారి స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, అలాగే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ప్రధాని తన ప్రసంగంలో మహిళలపై ప్రసంశలు కురిపించారు. ఉమెన్ పవర్ చాలా శక్తివంత మైనదన్నారు. మహిళలంతా తమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. మహిళా శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వం హేళన చేస్తోందని. మహిళలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదని విమర్శించారు. తెలంగాణను బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని ప్రధాని మోదీ విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే పని చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వాలేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ చేయించడం లేదన్నారు. బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ కవర్ చేయాలని చూస్తోందని, తాము మాత్రం అవినీతి పరులను వదిలిపెట్టేది లేదని మోదీ వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పని తనను తిట్టడమేనని ప్రధాని మోదీ విమర్శించారు. రోజంతా మోదీని తిట్టడానికి వాళ్ల సమయం కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ గ్యారంటీ ఉ ందన్నారు. కుటుంబ పార్టీలను ప్రజలు దూరంగా పెట్టాలన్నారు. దేశాన్ని దోచుకోవడమే కుటుంబ పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. తెలంగాణలో బిజెపికి మద్దతు



పెరుగుతోందని కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు తగ్గుతుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయని, బిజెపికి 400పైగా సీట్లు రావడం ఖాయమని, బిజెపికి ఓటు వేయాలని తెలుగులో ప్రధాని మోడీ చెప్పారు. తెలంగాణలో బిజెపిని ఎంతగా గెలిపిస్తారో అంతగా తాను బలోపేతం అవుతానని, తెలంగాణలో బిజెపికి అధికారమిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. పసుపు రైతుల కోసం పసుపు బోర్డు తీసుకొచ్చామని, తెలంగాణలో లక్ష కోట్ల విలువైన ధాన్యం కొన్నామని పేర్కొన్నారు. గత మూడు రోజుల్లో తాను తెలంగాణకు రావడం ఇది రెండోసారి అని, తెలంగాణ కోసం రూ. వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, తెలంగాణలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇటీవల శ్రీకారం చుట్టామన్నారు. తెలంగాణ నలుమూలల నుంచి బిజెపికి మద్దతు పెరుగుతోందన్నారు. మాల్కాజ్‌గిరిలో బిజెపి ర్యాలీలో ప్రజలు భారీగా పాల్గొని మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. శక్తి రూపంలో మహిళలు తనని ఆశీర్వదించేందుకు వచ్చారని, ఇది తన భాగ్యమని, శక్తిస్వరూపులైన ప్రతి మాత, సోదరి, కుమార్తెల కోసం పూజారిగా ఉన్నానని, శక్తిస్వరూపులైన మహిళల రక్షణ కోసం తాను ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని మోడీ స్పష్టం చేశారు. తాను భారతమాత పూజారిని అని పేర్కొన్నారు.ఆంగ్లేయులు, రజాకార్లతో పోరాడిన నేల ఇది అని ప్రశంసించారు. కాంగ్రెస్ తెలంగాణ ఆశలను నాశనం చేసిందని, తెలంగాణ ప్రజలను బిఆర్ఎస్ దోచుకొని ద్రోహం చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ తెలంగాణను తమ ఎటిఎంలాగా మార్చుకుందని, తెలంగాణ డబ్బు ఇప్పుడు ఢిల్లీ చేరుతోందని దుయ్యబట్టారు. ఒక దోపిడీదారు? మరో దోపిడీదారుపై పోరాటం చేయలేదని ప్రజలకు తెలుసునన్నారు. బిఆర్ఎస్ దోపిడీపై కాంగ్రెస్ మౌనం వహిస్తోందని దుయ్యబట్టారు. కాళేశ్వరం దోపిడీని కాంగ్రెస్ ప్రశ్నించడం మానేసి, బిఆర్ఎస్‌ను కాంగ్రెస్ కాపాడుతోందని మోడీ ధ్వజమెత్తారు. తెలంగాణను దోచుకున్న వారిని తాము విడిచిపెట్టేది లేదు అని, కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకునేందుకు రాజకీయాలు చేస్తున్నాయని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ దోపిడీని పరిశీలించినా దాని వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయని, 2 జి స్పెక్ట్రమ్ కేసులో డిఎంకె పేరు బయటకు వచ్చిందని, అది కుటుంబ పార్టీ అని, నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పేరు బయటకు వచ్చిందని, అది కుటుంబ పార్టీ అని, ఇప్పుడు ఆ జాబితాలో కుటుంబ పార్టీ బిఆర్ఎస్ చేరిందని ధ్వజమెత్తారు. కుటుంబ పార్టీ అయిన బిఆర్ఎస్ కాళేశ్వరంలో అవినీతి చేసిందని, ఢిల్లీ మద్యం విషయంలోనూ బిఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని ఆయన చురకలంటించారు. పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుందని ప్రధాని మోదీ మండిపడ్డారు. తొలుత తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సీనియర్ నేతలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఇతర కీలక నేతలు హాజరయ్యారు. రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరిగిందన్న మోదీ.. మే 13న తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారని అన్నారు. 'దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం. భారత్ అభివృద్ధి చెందితేనే తెలంగాణలోనూ అభివృద్ధి జరుగుతుంది. బీఆర్ఎస్ పై ప్రజలకు ఉన్న ఆగ్రహం గత అసెంబ్లీ ఎన్నికల్లో బయటపడింది. తెలంగాణ అభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మాకు అధికారం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యం.' అని మోదీ పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ పని అయిపోతుందని మోదీ అన్నారు.



## శక్తిపై పోరాట వ్యాఖ్యల వక్రీకరణ

### మోడీ తీరుపై మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం): 'శక్తి'పైనే పోరాటం అంటూ తాను చేసిన వ్యాఖ్యలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వక్రీకరించారని రాహుల్ గాంధీ అన్నారు. ముంబైలో రాహుల్ సోమవారంనాడు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో ఆయన తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తన వాదన వినిపించారు. మోదీ నా మాటలు ఇష్టపడరు. ఆయన నా మాటలు వక్రీకరించేందుకు, అర్థం మార్చిచెప్పేందుకు ప్రయత్నించారు. ఎందుకంటే...ఆయనకు నేను లోతైన సత్యాన్ని చెప్పిన విషయం బాగా తెలుసు' అని రాహుల్ అన్నారు. ఎవరిమీదైతే తాము పోరాటం సాగిస్తున్నామో దానినే శక్తి అని తాను సంబోధించానని, ఆ శక్తి మోదీనే అని అన్నారు. ఆ శక్తి భారతదేశ వాణిని, సంస్థలను, సీబీఐ, ఐటీ శాఖ, ఈడీ, ఎన్నికల కమిషన్, మీడియా, పరిశ్రమలు, రాజ్యాంగ వ్యవస్థను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటోందని వ్యాఖ్యానించారు. ఆ పవర్‌తోనే నరేంద్ర మోదీ వేలకోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తుండగా, స్వల్పమైన రుణాలను కూడా తీర్చలేక రైతులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోందని విమర్శించారు. 'శక్తి' వ్యాఖ్యల వివాదం ముంబైలో ఆదివారం జరిగిన 'భారత్ జోడో న్యాయయాత్ర' ముగింపు సమావేశంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, మోదీపై పోరాటం వ్యక్తిగతం కాదన్నారు. శక్తి(అధికారం)కి వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని, ఇక్కడ శక్తి అంటే ఏమిటనే ప్రశ్న ఉందని అన్నారు. రాజు (మోదీ) ఆత్మ ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఆదాయం పన్ను సంస్థల్లో ఉందని, అవి లేకుండా గెలవలేరని విమర్శించారు. ఆయన వ్యాఖ్యలను ప్రధాన మంత్రి మోదీ తెలంగాణలోని జగిత్యాలలో సోమవారం జరిగిన ర్యాలీలో తిప్పికొట్టారు. తమ పోరాటం శక్తితోనేనంటూ 'ఇండి' కూటమి చెబుతోందని, తన వరకూ ప్రతి తల్లి, చెల్లి, కూతురు అంతా శక్తిస్వరూపాలేనని, శక్తి రూపంలో వారిని ఆరాధిస్తానని, తాను భరతమాత ఆరాధకుడినని చెప్పారు. ఈ శక్తిని అంతం చేస్తామంటూ 'ఇండి' కూటమి సవాలును ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

## ఎన్నికల బాండ్లపై మరోసారి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం): ఎన్నికల బాండ్ల వివరాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి స్పష్టమైన ఆదేశాలు వెలువరించింది. రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో ఇచ్చిన విరాళాలకు సంబంధించిన ఏదీ దాచిపెట్టడానికి లేదని, వాటిని కొనుగోలుచేసిన వ్యక్తులు, సంస్థల వివరాలను బహిర్గతం చేయాల్సిందేనని పునరుద్ఘాటించింది. ఎన్నికల బాండ్ల సీరియల్ నెంబర్ల సహా పూర్తి డేటాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) గురువారంలోగా వెల్లడించాలని ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది. ఎస్బీఐ అసంపూర్తి డేటాను వెల్లడించదని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. 'మీవద్ద ఉన్న ఎన్నికల బాండ్లకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని బహిర్గతం చేయాలని మేము ఆదేశిస్తున్నాం' అని పేర్కొంది. ఎటువంటి సమాచారం దాచిపెట్టలేదని, డేటా మొత్తం అందజేసినట్టు తెలియజేస్తూ గురువారం సాయంత్రం 5 గంటల్లోగా అఫిడవిట్ సమర్పించాలని ఎస్బీఐ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించింది. అలాగే, ఎస్బీఐ ఇచ్చిన వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సూచించింది. కాగా, గత నెలలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దుచేసిన అత్యున్నత న్యాయస్థానం.. గత ఐదేళ్లలో బాండ్లను కొనుగోలు చేసిన వ్యక్తులు, సంస్థలు వివరాలను వెల్లడించాలని తేల్చిచెప్పింది. 'ఏం వెల్లడించాలో మీరు మాకు చెప్పండి... మేము వెల్లడిస్తాం' అన్నట్లుగా ఎస్బీఐ వైఖరి ఉంది. అది సరైంది కాదు. మేము అన్ని వివరాలు" అని చెప్పినప్పుడు డేటా అంతా అని అర్థం' అని సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. 'ప్రతి సమాచారం బయటకు రావాలి.. వివరాలన్నీ బయటకు రావాలి. ఏదీ అణచివేయబడలేదని మేము నిర్ధారించాలనుకుంటున్నాం' అని వ్యాఖ్యానించారు.

## ఆ ముగ్గురితో కవితకు లింకులు

మొదటి పేజీ తరువాయి...

చేసింది. ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లోని కవిత ఇంట్లో సోదాలు నిర్వహించామని తెలిపింది. అయితే.. సోదాలు చేస్తున్న సమయంలో కవిత కుటుంబ సభ్యులు ఆటంకం కలిగించారని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ముందు నుంచి చెప్తూ వస్తున్న.. వంద కోట్ల ముడుపుల వ్యవహారంలో ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉందని మరోసారి ఉద్ఘాటించింది ఈడీ. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలతో కలిసి ఢిల్లీ లిక్కర్ పాలసీని లీక్ చేసి.. అందుకు వారికి వంద కోట్ల ముడుపులను కవిత చెల్లించారని వెల్లడించింది. మద్యం పాలసీ రూపకల్పనలో కవిత, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అరవింద్ కేజ్రీవాల్ మనీష్ సిసోడియాతో కలిసి కుట్ర చేశారని ఆరోపించారు. ఆప్ నేతలకు రూ.100 కోట్ల ముడుపుల చెల్లింపులో కవిత క్రియాశీలక పాత్ర పోషించిందని ఈడీ పేర్కొంది. ఇందుకు సంబంధించిన విషయాలపైనే.. లోతుగా విచారిస్తున్నామని ఈడీ వివరించింది. ఈ లిక్కర్ స్కాంలో నిందితులైనా ఆప్ నేతలు మనీష్ సిసోడియా, ఎంపీ సంజయ్ సింగ్, విజయనాయర్‌లతో కవితకు లింకులు ఉన్నాయని ఈడీ ఆరోపించింది. మరోవైపు.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి ఇప్పటి వరకు 240 చోట్ల సోదాలు చేసినట్టు తెలిపింది ఈడీ. 5 సప్లిమెంటరీ ఛార్జ్ షీట్‌లు దాఖలు చేసినట్లు ఈడీ పేర్కొంది. ఇప్పటివరకు రూ.128.79 కోట్ల ఆస్తులను గుర్తించి జప్తు చేశామని ఈడీ స్పష్టం చేసింది. ఈ కేసులో ఇప్పటికే మనిష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్ సహా ఇప్పటివరకు 15 మందిని అరెస్టు చేశామని తెలిపారు. ఇదిలా ఉంటే.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో భాగంగా మనీలాండరింగ్ ఆరోపణలపై ఎమ్మెల్సీ కవిత ఇంటిపై ఈ నెల 15న సోదాలు చేసి.. అదే రోజు రాత్రి అరెస్ట్ చేసి ఢిల్లీకి తరలించిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి రోజు ఢిల్లీలో రౌస్ ఎవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టగా.. కవితకు న్యాయస్థానం 7 రోజుల రిమాండ్‌కు అనుమతించింది. కస్టడీలో భాగంగా కవితను ఈడీ అధికారులు.. తాము సేకరించిన ఆధారాలను చూపిస్తూ విచారిస్తున్నట్టు సమాచారం.

## గవర్నర్ తమిళిసై రాజీనామా

మొదటి పేజీ తరువాయి...

దిగిపోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. రేవంత్ ప్రభుత్వంతో ఆమె సఖ్యతగానే మెలిగారు. అయితే గత కొంత కాలంగా ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ అయ్యేందుకు ప్రయత్నాలు చేశారు. ఈమేరకు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి అదిష్ఠానంతో మట్లాడారు కూడా. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గాను గవర్నర్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది. చెన్నె సెంట్రల్ లేదా తుత్తూకూడి నుంచి ఆమెను అభ్యర్థిగా బరిలోకి దింపాలని బీజేపీ యోచిస్తున్నట్లు తెలిసింది.

## బీహార్‌లో బీజేపీ, జేడీయూ మధ్య కుదిరిన ఒప్పందం

బీహార్, మార్చి 18 (ప్రభాత ఉదయం): బీహార్‌లో ఎన్డీయే అధికారికంగా తన సీట్ల-భాగస్వామ్య ఫార్ములాను సోమవారం సాయంత్రం ప్రకటించింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 17 సీట్లల్లో పోటీ చేయనుండగా, సీఎం నితీశ్ కుమార్ పార్టీ జనతాదళ్ యునైటెడ్ 16 స్థానాల్లో పోటీ చేయనుంది. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ ఐదు స్థానాల్లో, జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థాన్ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వాహాకు చెందిన ఆర్ఎల్ఎం ఒక్కో స్థానంలో పోటీ చేయనున్నాయి. ఎల్‌జేపీకి బలమైన కోట అయిన నవాడను బీజేపీ చేజిక్కించుకుంది. గయా, కరకత్ ఎంపీ సీట్లకు బదులుగా జేడీ(యు)కి షెయోహార్‌ను ఇచ్చింది. గత సారి కాంగ్రెస్ చేతిలో ఓడిపోయిన కిషన్‌గంజ్‌ను కూడా జేడీయూ దక్కించుకుంది. షెయోహార్ సీటు కోసం నితీష్ కుమార్ తీవ్రంగా లాబీయింగ్ చేశారని, సోమవారం సాయంత్రం పార్టీలో చేరిన లవ్లీ ఆనంద్‌ను ఇక్కడ నుండి పోటీకి దింపవచ్చని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. లవ్లీ ఆనంద్ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ భార్య, అప్పటి ఎమ్మెల్యే చేతన్ ఆనంద్ తల్లి, విశ్వాస తీర్మానం సమయంలో నితీష్ కుమార్ పక్షాన బహిరంగంగా నిలిచారు. రెండవసారి మహా కూటమిని విచ్ఛిన్నం చేసి, ఈ సంవత్సరం ప్రారంభంలో బీజేపీతో నితీశ్ కుమార్ జేడీ(యు) చేతులు కలిపిన విషయం తెలిసిందే. బీహార్‌లో మొత్తం 40 ఎంపీ సీట్లు ఉండగా.. అన్ని(40) స్థానాల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందని జనతాదళ్ యునైటెడ్‌కు చెందిన సంజయ్ ఝా అన్నారు.





## ఈసీ సంచలన నిర్ణయం

### బెంగాల్ డీజీపీ సహా 6 రాష్ట్రాల హెూం కార్యదర్శులపై వేటు

న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సంచలన నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా రాష్ట్రాల్లో లోక్ సభ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని చెప్పిన ఈసీ.. అందుకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో మార్పులు చేర్పులు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆరు రాష్ట్రాల హెూంశాఖ కార్యదర్శుల్ని తొలగిస్తూ సంచలన నిర్ణయం తీస్నుకుంది. అలాగే పశ్చిమ బెంగాల్ డీజీపీని సైతం తప్పించింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, జారండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి ఆరు రాష్ట్రాల్లో హెూంశాఖ కార్యదర్శులను తొలగిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. వీరితో పాటు మిజోరం, హిమాచల్ ప్రదేశ్‌లోని సాధారణ పరిపాలనా విభాగం కార్యదర్శిని కూడా తొలగించారు. అలాగే పశ్చిమ బెంగాల్ డీజీపీని కూడా తొలగించేలా ఈసీ ఆదేశాలు జారీ చేసింది. వీరితో పాటు బృహన్ ముంబై మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్ సింగ్ చాహల్, అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను కూడా ఈసీ తప్పించింది. సిఎం కార్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న జిఎడి మిజోరం, హిమాచల్ ప్రదేశ్‌ల కార్యదర్శిలను కూడా ఈసీఐ తొలగించినట్లు తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ఈసీ చేపట్టిన ఈ బదిలీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికలు నిష్పాక్షితంగా నిర్వహించేందుకు వీలుగా ఈసీ ఈ బదిలీలు చేపట్టినట్లు చెబుతున్నారు. లోక్ సభ ఎన్నికలకు ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 19న తొలిదశ పోలింగ్ ప్రారంభం కానుంది. జూన్ 1 వరకూ ఏడు దశల్లో పోలింగ్ కొనసాగనుంది. జూన్ 4న ఫలితాలు ప్రకటిస్తారు.

## దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయండి

### స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం): ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానంపై చర్యలు తీసుకోవాలంటూ బీఆరెఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి పార్టీ ఫిరాయింపుకు పాల్పడిన దానంపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇచ్చారు. కాగా, దానం ఆదివారం గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్పించుకొని ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. 'నువ్వు కొట్టినావ్ మేము తీసుకున్నాం.. మేము కొట్టినప్పుడు రేవంత్ రెడ్డి.. నువ్వు లేవకుండా పోతావ్.' అని ఘాటు కామెంట్స్ చేశారు. సింహం ఒక అడుగు వెనక్కి వేసిందంటే.. తిరిగి నాలుగు అడుగు ముందుకు దూసుకు వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాగా, ఆదివారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఇద్దరూ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాంతో దానంపై అనర్హత వేటు వేయాలని ఇవాళ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి పిటిషన్ ఇచ్చారు. అయితే ఈ పిటిషన్‌పై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాల్లో పెద్దగా ప్రభావం చూపకపోయినా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం సత్తా చాటింది. అన్ని స్థానాలు కైవసం చేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రేవంత్ మంత్రివర్గంలో ఎవరికీ ప్రాతినిథ్యం లేదు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మంత్రి పదవి ఆఫర్‌తోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే కాకుండా దానంను సికింద్రాబాద్ ఎంపీగా బరిలోకి దింపేందుకు కాంగ్రెస్ రెడీ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

## కూలిన నిర్మాణంలో ఉన్న భవనం


### ఏడురుగు వ్యక్తుల దుర్మరణం

కోల్‌కత, మార్చి 18 (ప్రభాత ఉదయం): కోల్‌కతా గార్డెన్ రీచ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉ న్న ఐదు అంతస్తుల భవనం కూలి ఇద్దరు మహిళలతో సహా కనీసం ఏడుగురు వ్యక్తులు మరణించారు. ఘటనలో అనేక మంది గాయపడినట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. భవనం కూలిన 16 గంటల తరువాత శిథిలాల కింద కనీసం నలుగురు చిక్కుకుపోయినట్లు గుర్తించడంతోను, వారిలో ఒకరే ప్రాణంతో ఉన్న సూచనలు కనిపించడంతోను మృతుల సంఖ్య పెరగవచ్చునని రక్షణ, సహాయ కార్యక్రమాలలో పాల్గొంటున్న అగ్నిమాపక శాఖ అధికారి ఒకరు సూచించారు. భవన నిర్మాణం అక్రమంగా జరుగుతున్న ఆ ప్రదేశంలో యుద్ధ ప్రాతిపదికన రక్షణ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ తెలిపారు. భవనం ప్రమోటర్ మహమ్మద్ వసీమ్‌ను అరెస్టు చేసినట్లు, చట్టం ప్రకారం కఠిన చర్య తీసుకోనున్నట్లు మేయర్ చెప్పారు. నగర పశ్చిమ పరిధిలోని అజాన్ మొల్లా లేన్‌లోని భవనం కూలిన ప్రదేశాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సందర్శించారు. అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోగలమని స్థానికులకు మమత హామీ ఇచ్చారు. భయంకరమైన ప్రమాదంలో నిర్మాణంలోని ఐదు అంతస్తుల భవనం ఆదివారం అర్ధరాత్రి ప్రాంతంలో కూలిందని మేయర్ హకీమ్ తెలియజేశారు. 'శిథిలాలలను తొలగించి, బాధితులను చేరుకునేందుకు మేము గ్యాస్ కట్టర్లు, ఇతర పరికరాలు వాడుతున్నాం. బాధితుల వద్దకు మేము చాలా జాగ్రత్తగా వెళు తున్నందున ఎక్కువ సమయం పడుతోంది' అని అగ్నిమాపక శాఖ అధికారి వివరించారు.

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

### నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా కూల్ అయ్యింది. ఆకాశం మేఘావృతమైనది.. పలు ప్రాంతాల్లో వర్షం వాన పడుతుంది. నిన్నటి (ఆదివారం) వరకు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా, తాజాగా హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో వర్షం పడటంతో.. ప్రజలు రిలాక్స్ అవుతున్నారు. కొండపూర్, మియాపూర్, చందానగర్, ఆర్సీపూరం, బీరంగూడ పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇక, హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఇవాళ పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండలు దంచి కొట్టాయి.. ఇక, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. నాంపల్లి, లక్డికాపూల్, ఖైరతాబాద్, మొజంజాహి మార్కెట్, కొండపూర్, చందానగర్, మియాపూర్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. మరోవైపు తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆదివారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వానలు కురిశాయి. మరో నాలుగు రోజులు రాష్ట్రంలో వడగండ్ల వానలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇప్పటికే నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగండ్ల వర్షాలతో పాటు, ఉరుములు, మెరుపులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది.వర్షాల హెచ్చరికల నేపథ్యంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావారణశాఖ. మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, జోగులాంబ గద్వాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బుధ, గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది.ఆదివారం ఆదిలాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వడగండ్ల వర్షం కురిసినట్లు తెలిపింది. అత్యధికంగా సంగారెడ్డి జిల్లా నాగలగిద్దలో 3.4 సెంటీమీటర్ల వర్షం కురవగా.. కంగ్టిలో 2.3 సెంటీమీటర్ల వర్షపాతం



నమోదైంది. వడగండ్ల వానలతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. నిజామాబాద్ జిల్లాలో కురిసిన వడగండ్ల వానకు పంటలు దెబ్బతిన్నాయి. మక్క, వరి, మామిడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా వరి, మక్క, జొన్న, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. 16,450 ఎకరాల్లో వరి, 3,621 ఎకరాల్లో మక్క, 163 ఎకరాల్లో మామిడి, 600 ఎకరాల్లో జొన్న, 50 ఎకరాలలో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.

# పదవ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక్



పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ శశాంక్

## తొలి రోజు ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు.. జిల్లా కలెక్టర్ శశాంక

రాజేంద్రనగర్,మార్చి18(ప్రభాత ఉదయం)రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి.పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అధికారులు అనుమతించారు.క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రంలో పంపించారు. సోమవారం ప్రారంభమైన పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీ దాకా కొనసాగనున్నాయి.ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు కొనసాగింది.రాజేంద్రనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.మొత్తం 9,112 మంది విద్యార్థులు తొలిరోజు తెలుగు పరీక్ష రాయగా,9056 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

### పరీక్షా కేంద్రాల్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్..

శంషాబాద్ లోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ తీరు పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు.అదే విధంగా మాస్ కాపీయింగ్ జరుగకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్ కు కలెక్టర్ సూచించారు.క్షుణ్ణంగా తనిఖీలు చేసిన మీదట విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలని అన్నారు.ఎట్టి పరిస్థితులలో ఎవరు కూడా పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ తీసుకుని వెళ్లకుండా పకడ్బందీగా చెక్ చేయాలని,పరీక్ష కేంద్రాలకు ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రశ్నాపత్రాలు,జవాబు పత్రాలు రవాణా పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించాలని సూచించారు.ఎండాకాలం దృష్ట్యా విద్యార్థులకు అందుబాటులో ఓఆర్ఎస్‌తో పాటుగా అవసరమైన మందులు వైద్య శిబిరంలో అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట శంషాబాద్ తహశీల్దార్ నాగమణి,సంబంధిత అధికారులు,తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రంలో అధికారితో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక్



బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 10వ తరగతి పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో 10వ తరగతి పరీక్షలు రాసిన 4, 685 మంది విద్యార్థులు

బుద్వేల్, మార్చి18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 19 పరీక్షా కేంద్రాలలో సోమవారం 4, 685 మంది 10వ తరగతి విద్యార్థులు మొదటి రోజు పరీక్షలు రాశారు. సర్కిల్ లో 4, 714 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా 29 మంది విద్యార్థులు గైరాజరు అయినట్లు మండల విద్యాధికారి రామిరెడ్డి తెలిపారు . ప్రతి పరిక్షా కేంద్రంలో ఒక సిట్టింగ్ స్క్వాడ్ ను పెట్టడం జరిగిందన్నారు. పట్టణ ప్రాంతాలలో తహ సిల్దార్లను, మండల ప్రాంతాలలో ఎంపీడీవో లను పదవ తరగతి పరీక్షల పర్యవేక్షణ బాధ్యతలను చూడాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. రంగారెడ్డి జిల్లాలో 12 ఫ్లయింగ్ స్క్వాడ్ లు పనిచేస్తున్నాయన్నారు. పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టడం జరిగిందని ఎంఈఓ రామిరెడ్డి తెలిపారు.

## ఘాన్సీమియా గుడ ఎల్లమ్మ దేవాలయ హుండీ లెక్కింపు

### ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ మధుబాబు


శంషాబాద్, మార్చ్ 18( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని ఘాన్సీ మియా గూడ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ మధుబాబు పిలుపునిచ్చారు. అమ్మవారి ఉండిని సోమవారం లెక్కించారు. రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ మధుబాబు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకన్న. మాజీ చైర్మన్ గుగ్గిళ్ళ రామనాథ ముదిరాజ్. రికార్డ్ అసిస్టెంట్ మహిపాల్ యాదవ్ సమక్షంలో ఉండిని లెక్కించారు హుండీలో భక్తులు సమర్పించిన నగదు లెక్కించగా 86,180 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయం కేవలం హుండీ లెక్కింపు ద్వారా మాత్రమే వచ్చిందని ఇన్స్పెక్టర్ మధుబాబు తెలిపారు. ఉండి లెక్కింపు కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పగుడాల శ్రీశైలం. ఆలయ అర్చకులు ఎం మల్లికార్జున. కమిటీ మాజీ సభ్యులు జిల్లా అర్జున్ ముదిరాజ్తదితరులు పాల్గొన్నారు.

## సింగర్ మంగ్లీకి తప్పిన పెను ప్రమాదం

రాజేంద్రనగర్,మార్చి18(ప్రభాత ఉదయం) ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీకి తృటిలో ప్రమాదం తప్పింది.ఆమె ప్రయాణిస్తున్న కారును డీసీఎం వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మంగ్లీ సహా కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి.ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.హైదరాబాద్%--%బెంగళూరు జాతీయ రహదారి పై తొండుపల్లి వంతెన వద్ద శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు శంషాబాద్ పోలీసులు తెలిపారు.రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో నిర్వహించిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవానికి మంగ్లీ శనివారం హాజరయ్యారు. కార్యక్రమం పూర్తి చేసుకొని అర్ధరాత్రి సమయంలో మేఘ్‌రాజ్, మనోహర్‌తో కలిసి ఆమె కారులో ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై తొండుపల్లి వంతెన వద్దకు రాగానే కర్ణాటకకు చెందిన ఓ డీసీఎం వాహనం వెనుక నుంచి వేగంగా మంగ్లీ ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది.ఈ ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయలయ్యాయి.కారు వెనుక భాగం కూడా పూర్తిగా దెబ్బతినింది.డీసీఎం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది..



స్వల్ప గాయాల పాలైన సింగర్ మంగ్లీ



ప్రమాదానికి గురైన కారు

## బీఆర్ఎస్‌ని విడిచి అధికార పార్టీల్లోకి వెళ్తున్న ప్రతి నాయకుడికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు

### ఉద్యమా నాయకులు అదిరాల పరమేష్

రాజేంద్ర నగర్,(ప్రభాత ఉదయం):మీరు గడిచిన పదేండ్లు గౌరవ పదవులు అనుభవించి ప్రజల్లో గుర్తింపు పొందారు.కానీ అధికారం లేకపోతే మీరు ఉండలేకపోతున్నారని ఉద్యమా నాయకులు అదిరాల పరమేష్ తెలిపారు.మీకు మీ ఉణికిని కాపాడుకోవడం ముఖ్యం! అర్థం చేసుకోగలను ! మంచిది !.ధన్యవాదాలు ఎందుకంటే ? మా పెద్దలకు మీరు చేస్తున్న ఈ ద్రోహం వారు ఎప్పటికీ మరచిపోరని హేదేవ చేశారు.లక్షల మంది కార్యకర్తల పార్టీ మాది..కొత్త నాయకత్వం సిద్ధంగా ఉంది.ప్రజలు సిద్ధంగా ఉన్నారు.ఉ ద్యమకారులు,మేధావులు,యువనాయకులు చాలా ఉన్నారు.! మీలాంటి స్వార్థపరులు పోతే..మాకు అన్న అవకాశాలు వస్తాయని అయనతెలిపారు.తిరిగి గులాబీ జెండా ఎగరేస్తాం ! కానీ అప్పుడు మాత్రం సిగ్గు లేకుండా మళ్లీ రాకండి,ఒకవేళ వచ్చిన ఈరోజు చేసిన ద్రోహం మరచిపోము అని ఆగ్రహం వ్యక్తం చేశారు!.



మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు ఆదిరాల పరమేష్

## నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం సీజ్

బుద్వేల్, మార్చి18(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఓ బహుళ అంతస్తు భవనాన్ని సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. స్టిల్ ప్లస్ టు ఫ్లోర్ లకు అనుమతులు తీసుకొని మూడు ఫ్లోర్ లు అదనంగా వేశారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ కబీర్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి యాక్ట్ సెక్షన్ 461 - ఎ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నారని ఫిర్యాదు వచ్చిందని , దీంతో సీజ్ చేయడం జరిగిందన్నారు. నిర్మాణదారుడు ఇకమీదట ఆ భవనంలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దన్నారు. అలా చేసినట్లయితే క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



అత్తాపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనాన్ని సీజ్ చేసిన రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు




నిర్మాణంలో ఉన్న ఇంటికి నోటీసు అంటించిన అధికారులు



తేనెటీగల పెంపకంపై శిక్షణలో పాల్గొన్న రైతులు

## తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

### పరిశోధనా సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్

రాజేంద్రనగర్, మార్చి18(ప్రభాత ఉదయం) శాస్త్రీయ తేనెటీగల పెంపకంతో గృహిణులకు, మహిళా రైతులకు, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, కల్తీ లేని తేనె అందరికీ అందుబాటులోకి వస్తుందని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. రాజేంద్రనగర్ లోని కూరగాయల పరిశోధన స్థానం, తేనెటీగల అభివృద్ధి పథకం సంయుక్తంగా జిల్లా స్థాయి శాస్త్రీయ తేనెటీగల పెంపకం పై ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వారం రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ జోనల్ హెడ్, డాక్టర్ అనిత కుమారి హెడ్, డాక్టర్ ప్రీతం గౌడ్, డాక్టర్ సాయి నిఖిల్, డాక్టర్ భాగ్య శాలి, డాక్టర్ సురేష్, డాక్టర్ సంపత్, ఏ ఈ ఓ పోతురాజు యాదయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పి ఓ డైరెక్టర్ ఇందిర, డైరెక్టర్ రాఘవేంద్ర కేతిరి , పాల్గొని తేనెటీగల పెంపకం పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో 25 మంది రైతులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్

## బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



జయంతి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనసభ అధిపతి గడ్డం ప్రసాద్ కుమార్


### అణగారిన వర్గాల కోసం అను నిత్యం చట్ట రూపేణా హక్కులు కలిపించిన మహా నేత : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

బుద్వేల్, మార్చి18(ప్రభాత ఉదయం) : ఏప్రిల్ 5 న రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆరాంఘర్ చౌరస్తాలో డా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి ని పురస్కరించుకొని స్పీకర్ ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఆహ్వాన పత్రిక బ్రోచర్ ను సోమవారం విడుదల చేసారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి కార్యక్రమం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేయుటలో ముందుంటుందని అన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ పేద ప్రజల అభ్యున్నతికి కోసం కృషి చేయాలనీ దళిత నాయకులకు పిలుపు నిచ్చారు. రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి. ప్రకాష్ గౌడ్ కు ఆహ్వానం అందజేశారు . బ్రోచర్ విడుదల కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు పోయిల జీవన్ దాస్, మా జీ అధ్యక్షులు టి ఆర్ శ్రీరాములు, గోల్కొండ రాజు కుమార్, పంబాల రాజు, పలుగు చెరువు మహేష్, ప్రస్తుత అధ్యక్షులు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్, నాయకులు కోరని దయానంద్, జాన్ పాల్ , బాబురావు, గోల్కొండ ఉపేందర్, ఎడ్లకాడి చంద్ర షేకర్, బర్ల సుమన్, కవ్వగూడెం గౌతమ్, జంగయ్య, సంజీవ, బచ్చల మహేష్, ప్రీతమ్ రాజ్, గుంటి రాజ్ కుమార్, బలరాం, రమేష్, బండారి సుదర్శన్ తదితరులు ఉన్నారు



మొదటి బ్రోచర్‌ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు అందచేస్తున్న దళిత నాయకులు

# వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి దంపతులు



ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి పూజలు చేస్తున్న బిజెపి చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి దంపతులు



పూజలు చేస్తున్న సంగీతా రెడ్డి

శంషాబాద్, మార్చి 18,(ప్రభాత ఉదయం ) శంషాబాద్ మండలంలోని రామానుజ పూర్ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత మూడు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమాల అనంతరం సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బిజెపి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి. ఆయన సతీమణి సంగీతా రెడ్డి కళ్యాణోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమంలో వారు పాల్గొన్నారు. . వేద పండితులచే ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మైలార్ దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రేమ్ రాజ్, కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ కొప్పాల నరసమ్మ. బిజెపి నాయకులు విజయ భాస్కర్ రెడ్డి. మహేష్ నేత. ప్రకాష్ ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డీకే అరుణ

## శ్రీనివాస్ గౌడ్ బీజేపీలో చేరుతున్నారు అనేది అసత్యం: డీకే అరుణ

మహబూబ్ నగర్,మార్చి18(ప్రభాత ఉదయం)మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారు అంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు అని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్పష్టం చేశారు.సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. భారతీయ జనతా పార్టీకి ప్రజలలో ఉన్న ఆదరణను ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలని, ప్రజలను తప్పుదోవ పట్టించాలి అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారు అంటూ ప్రచారం చేశారని ఆమె వెల్లడించారు.శ్రీనివాస్ గౌడ్ పార్టీలో చేరే అంశంపై మమ్మల్ని సంప్రదించలేదు.రాష్ట్ర, జాతీయ నేతలతో సంప్రదించిన విషయం మాకు తెలిసేది. ఇందులో ఏది కూడా జరగలేదు.. కానీ ప్రచారం మాత్రం జోరుగా చేస్తున్నారు అని ఆమె పేర్కొన్నారు. ఇది అంతా కొంతమంది కుట్ర వల్ల జరుగుతుందని ఆరోపించారు. ఇటీవల నాగర్ కర్నూల్ లో జరిగిన బీజేపీ బహిరంగ సభ సక్సెస్ కావడం, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతుండడాన్ని జీర్ణించుకోలేక కుట్రలు చేస్తున్నారని డీకే అరుణ వెల్లడించారు. మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి బిజెపిని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా చేసిన వ్యాఖ్యానాలను ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా గతంలో ఓ బహిరంగ సభలో జితేందర్ రెడ్డి తను పార్టీ మారే అంశంపై చేసిన వీడియోను మీడియాకు చూపించారు. జితేందర్ రెడ్డి కారణంగానే ముఖ్య నాయకులు పార్టీని వీడలేదా..!? అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారాన్ని మరింత జోరుగా నిర్వహిస్తామని డీకే అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కృష్ణ వర్ధన్ రెడ్డి, అంజయ్య, రాజేందర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన రెడ్డి సంఘాలు

కూకట్‌పల్లి,మార్చి18 (ప్రభాత ఉదయం) తెలంగాణ ముఖ్యమంత్రి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై రెడ్డి సోదరుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కార్పొరేషన్ ఏర్పాటుకు కృతజ్ఞతగా సోమవారం కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట వై జంక్షన్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. ప్రతికూలంలోనూ ధనవంతులు ఉన్నట్లే పేద ప్రజలు ఉంటారని వారికి న్యాయం చేయాలని ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించి తద్వారా ఆయా కులాల్లోని పేదలు లబ్ధి పొందేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పుష్పారెడ్డి, ప్రతాప్ రెడ్డి, సేరి సతీష్ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గున్నాల అనిల్ రెడ్డి, రెడ్డి ఐక్యవేదిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి నాగిరెడ్డి, బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, బలవంత రెడ్డి, రాం రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, తదితరుతో పాటు పులి శివకుమార్ గౌడ్, పులి శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఎస్సీ ఛైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంకుకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

కూకట్‌పల్లి, మార్చి 18 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఛైర్మన్ గా నియమితులైన నాగరిగారి ప్రీతంని సోమవారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ అద్యక్షుడు పత్తి కుమార్, కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకుడు మాజీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షులు నాలోల రాజేందర్ కూకట్ పల్లి నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీటకోరు కృష్ణ బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన కుమార్ కూకట్ పల్లి నియోజకవర్గం సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజనంద్ శేఖర్ సీనియర్ నాయకులు వెంకటేష్ తదితరుల పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జీ బండి రమేష్ ఆద్వర్యంలో భారీగా చేరికలు

కూకట్‌పల్లి, మార్చి 18 (ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ లోకి చేరికలు కూకట్ పల్లి నియోజక వర్గం బోయిన్ పల్లి డివిజన్ కు చెందిన టీఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్, కూకట్ పల్లి డివిజన్ కి చెందిన మేకల మహేష్, మరియు వారి మిత్ర బృందం కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బండి రమేష్ సమక్షంలో గొట్టి ముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ కార్యక్రమంలో శేరి సతీష్ రెడ్డి, తూము వేణు, దందుగుల యాదగిరి, మేకల రమేష్, కృష్ణ రాజ్ పుత్, మహేష్ యాదవ్, గోవింద్ గౌడ్, అనిల్, గుండమళ్ళ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కింట్లో రాళ్లు పడ్డాయని రాళ్లతో దాడి

### విశ్రాంత ఉద్యోగికి గాయాలు

గద్వాల,మార్చి18(ప్రభాత ఉదయం) ఇంటి కంపౌండ్ గోడ కూల్చే సమయంలో పక్కింట్లో రాళ్లు పడాయని వ్యక్తులపై దాడి చేశారు. ఈ ఘటనలో విశ్రాంతి ఉద్యోగితో పాటు అతని కుమారుడికి గాయాలయ్యాయి. గద్వాల ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణం రాధాకృష్ణ కాలనీకి చెందిన విశ్రాంతి ఉద్యోగి కే.కేశవ్ కుమార్ భీంనగర్ లో ఓ ఇల్లు కొన్నాడు. ఇంటి కంపౌండ్ గోడ కూల్చే సమయంలో ఇంటి పక్కన గల నాగరాజు ఇంట్లో రాళ్లు, దుమ్ము పడ్డాయి. విశ్రాంతి ఉద్యోగి కేశవ్ కుమార్ కుటుంబ సభ్యులతో నాగరాజు కుటుంబ సభ్యులు గొడవకు దిగ్గాడు. పని పూర్తి అయిన తర్వాత రాళ్లు తొలగిస్తామని చెప్పిన వినకుండా విశ్రాంతి ఉద్యోగి కేశవ్ కుమార్, అతని కుమారుడు వైభవ్ పై నాగరాజు కుటుంబ సభ్యులు రాళ్లతో దాడి చేశారు. అంతే కాకుండా అదే సమయంలో నాగరాజుకు మద్దతుగా శశిధర్ రెడ్డి అనే వ్యక్తి విశ్రాంతి ఉద్యోగి కుటుంబ సభ్యులపై దాడికి దిగ్గారు. ఈ దాడిలో విశ్రాంతి ఉద్యోగి కేశవ్ కుమార్, వైభవ్ కు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## ఈడీ నోటీసులపై కవిత భర్త అనిల్ కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో ఈడీ అధికారులు వేగం పెంచారు. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయటమే కాకుండా.. కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు కూడా. అయితే.. ఈనెల 15న హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించి.. అదే రోజు సాయంత్రం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే.. కవితను అరెస్ట్ చేసిన సమయంలో.. కవిత భర్త అనిల్‌తో పాటు ఆమె పీఆర్వో రాజేశ్, ముగ్గురు అసిస్టెంట్లకు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం ఈ నోటీసులను జారీ చేయగా.. సోమవారం (మార్చి 18న) విచారణకు హాజరుకావాలని ఈడీ పేర్కొంది. అయితే.. ఆ నోటీసుల మేరకు ఈరోజు ఈడీ ముందు.. కవిత భర్తతో పాటు ఐదుగురు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. గైర్హాజరయ్యారు. ఈడీ జారీ చేసిన నోటీసులపై అనిల్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈడీ విచారణకు హాజరు కావొద్దని అనిల్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఈడీకి లేఖ కూడా రాశారు. ఈడీ విచారణకు హాజరు కాలేనని లేఖలో ఈడీకి అనిల్ స్పష్టం చేశారు. ఈ అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కవిత భర్త లేఖపై ఈడీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే.. గతంలో కవితకు కూడా ఈడీ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో.. ఆమె కూడా ఇలాగే విచారణకు హాజరుకాలేనంటూ ఈడీకి లేఖలు రాసిన విషయం తెలిసిందే. దీంతో.. కవిత భర్త అనిల్ కూడా ఆమె బాటలోనే పయనిస్తున్నారంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో భాగంగా ఈ నెల 15న హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఈడీ సోదాలు జరిపిన సందర్భంగా.. కవితతో పాటు, ఆమె భర్త అనిల్ ఆస్తుల వివరాలపై కూడా ఆరా తీసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే.. అనిల్‌తో పాటు ఆమె పీఆర్వో, ముగ్గురు అసిస్టెంటల్ ఫోన్లు సీజ్ చేశారు ఈడీ అధికారులు. ఈ మేరకు సోమవారం విచారణకు హాజరుకావాలని ఐదుగురికి నోటీసులు ఇచ్చారు.



## ఏసీబీ అధికారులకు చిక్కిన నిజాంపేట్ టౌన్ ప్లానింగ్ అధికారి

హైదరాబాద్,మార్చి 18(ప్రభాత ఉదయం) అనిశా అధికారుల వలకు నిజాంపేట టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు చిక్కారు. సోమవారం శ్రీనివాసరావు రూ. 1.50 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి, మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ వ్యక్తి టీపాయింట్ బోర్డు తొలగించకుండా ఉండేందుకు శ్రీనివాసరావు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం హర్షణీయం

### కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



కూకట్‌పల్లి,మార్చి18 (ప్రభాతఉదయం) రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కు క్యాబినెట్లో నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందణీయమని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలో అనేక మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఉన్నారని, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారి భవిష్యత్తు కోసం విద్యార్థులు విదేశాలలో చదువుకోడానికి రూ.20 లక్షల విదేశీ విద్యా పథకం ప్రవేశ పెట్టాలని, అదే విధంగా ఆర్థిక సహాయంతో పాటు కార్పొరేషన్ కు రూ.500ల కోట్ల నిధులు మంజూరు చేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని ఆవుల రవీందర్ రెడ్డి. అదేవిధంగా అనేక సంవత్సరాలుగా రాజకీయాలక తీతంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు జేఏసీగా ఏర్పడి కృషి చేసిన జేఏసీ నాయకులకే కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు.

# చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం

### మాజీ మంత్రి సబితా రెడ్డి

హైదరాబాద్, మార్చి 18(ప్రభాత ఉదయం) చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగరవేస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మాజీ మంత్రి సబితా రెడ్డి స్వగృహంలో, ఎమ్మెల్సీ మల్లేష్, చేవెళ్ల పార్లమెంట్ బి ఆర్ ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కే యాదయ్య, అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేష్ రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, యువ నేత పి కార్తీక్ రెడ్డి లతో సమావేశమై పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలుపు పై సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం మాజీ మంత్రి తబితా రెడ్డి మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రంగారెడ్డి ,వికారాబాద్ జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని ప్రజలు టిఆర్ఎస్ కు ఓటు వేయటానికి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా క్షేత్రస్థాయిలో పనిచేసే జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. జ్ఞానేశ్వర్ ని భారీ మెజార్టీతో ఖచ్చితంగా గెలిపిద్దా మన్నారు.



చేవెళ్ల బిఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో మాజీ మంత్రి సబితా రెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.